28న ఎన్టీఆర్ జయంతిన సంగీత విభావరి

సికింద్రాబాద్, మే 26: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 101వ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్ కుమార్ ఆదివారం తెలిపారు. ఈ నెల 28న మంగళవారం సాయంత్రం ఏడు గంటలకు ఎన్టీఆర్ అభిమాన సంఘం సికింద్రాబాద్ వారి ఆధ్వర్యంలో సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీతాఫల్‌మండి చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగే వేడుకలకు హాజరు కావాలని వల్లారపు కోరారు. అలాగే, తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల అధ్యక్షులకు, ప్రధాన కార్యదర్శులకు, కుటుంబ సభ్యులకు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

2.30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు..

ముషీరాబాద్: పార్కిగుట్ట ఫీడర్ పరిధిలోని ప్రేయర్ పవర్ చర్చి, రాంనగర్, బాప్టిస్టు చర్చి, బ్రహ్మంగారి టెంపుల్, ఈడ బ్లూఎస్ క్వార్టర్స్, స్మశాన వాటిక పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

సా॥ 4 నుంచి 5 గంటల వరకు..

44 నంబరు బస్సు స్టాఫ్ ఫీడర్ పరిధిలోని ఫ్రెండ్స్ కాలనీ, 44 నంబర్ బస్ స్టాఫ్, గంగపుత్రకాలనీ, చేపల మార్కెట్, రామాలయం, అంజయ్య నాలా పరిసర పాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

వైభవంగా శ్రీవారి కల్యాణ మహోత్సవం

శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. కార్యనిర్వాహణాధికారి కె.రామంజనేయులు, వ్యవస్థాపక వంశీయుడు జి.శ్రీనాథ్‌గౌడ్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. స్వామి వారి కల్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చేసి పూజలు చేశారు.

– చిక్కడపల్లి, మే 26;

గృహిణి అదృశ్యం

మాధవి(ఫైల్)

దుండిగల్, మే 26: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ గృహిణి అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం డివిజన్ అవెన్యూ ఎంక్లేవ్‌లో నివాసం ఉంటున్న డి.సురేశ్ మాధవి(35)కి గత 19 ఏండ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం ఉండగా.. వారిలో కూతురు అనుశ్రీ(16), కొడుకు పార్థివన్(14) ఉన్నారు. సురేశ్ కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తుండగా.. మాధవి చిన్న బిజినెస్ చేసుకుంటూ ఇంటి వద్దనే ఉంటుంది. ఇటీవల బిజినెస్‌లో నష్టం రావడంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పాడ్డాయి. ఈ నెల 20న సాయంత్రం నాలుగు గంటలకు కళాశాలకు వెళ్లగా.. అప్పటికే ఇంట్లో భార్య, తన ఇద్దరు పిల్లలు ఉన్నారు. తిరిగి 6.30 గంటలకు ఇంటికి వచ్చేసరికి భార్య ఇంట్లో కన్పించలేదు. పిల్లలు ఇంట్లోలేని సమయంలో ల్యాప్‌టాప్, కెమెరా, బట్టలు తీసుకెళ్లింది. ఆమె ఆచూకీ కోసం బంధువులు, తెలిసిన వారికి వాకబు చేయగా.. ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కుత్బుల్లాపూర్, మే 26: గుర్తు తెలియని సుమారు 50-55 ఏండ్ల యాచకుడి మృతదేహం లభ్యమైన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. కేఎస్‌సీ రెస్టారెంట్ ఫుట్‌పాత్‌పై ఉదయం నలుపురంగు దుస్తులు వేసుకొని, తెల్లగడ్డం ఉన్న వృద్ధుడి మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో సంఘటన స్థలానికి చేరుకొన్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాలని కోరారు.

మట్టితో కూరుకుపోయిన ఇంకుడు గుంత

వ్యర్థాలతో పేరుకుపోయిన ఇంకుడు గుంత

ఇంకుడు గుంతలు వ్యర్థాలమయం

జల వనరుల పెంపునకు చర్యలేవి?

- పూడిక తీత, పునరుద్ధరణ పనుల జాడలేవి?
- ఇంకుడు గుంతలను పరిరక్షించాలంటున్న ప్రజలు

అమీర్‌పేట్, మే 26: చినుకు చినుకును ఒడిసి పట్టుకొని, జల వనరులను పెంపొందించుకునేందుకు పాలకులు, అధికార యంత్రాంగం కృషి చేయాల్సిన సందర్భం ఇది. రానున్నది వర్షాకాలం. ఈ నేపథ్యంలోనే వర్షపు నీటిని చుక్కా చుక్కా పట్టుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఆ దిశగా అధికార వర్గాలు ప్రయత్నాలు చేపట్టాలి. కాని, ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ప్రభుత్వ యంత్రాంగం తీరు ఉన్నది. అడుగంటుతున్న భూగర్భ జల వనరులను పెంపొందేందుకు దోహదపడే ఇంకుడు గుంతల నిర్మాణాలను ప్రభుత్వ విభాగాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టుకుని ఉంచేందుకు జీహెచ్‌ఎంసీ, జల మండలి విభాగాలు శాస్త్రీయ పద్ధతుల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలను చేపట్టింది. అయితే, వర్షాలు పడని ఇతర సమయాల్లో ఇంకుడు గుంతల్లో మట్టి, ఇతర వ్యర్థాలతో నిండిపోతున్నాయి. ప్రతియేటా వర్షాలు పడే సమయానికి ఈ ఇంకుడు గుంతలను వరదనీటిని ఒడిసి పట్టేందుకు వీలుగా అధికారులు సిద్ధం చేస్తుంటారు. అయితే, వర్షాలు తరుముకొస్తున్నా జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు ఇంకా ఇంకుడు గుంతల్లో పూడికలను తొలగించే పనులను చేపట్టలేదు. సనత్‌నగర్ డివిజన్‌లో జీహెచ్‌ఎంసీ, జల మండలి విభాగాలు ఈ ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టడం జరిగింది. 60కి పైగా పార్కులు కలిగి ఉన్న సనత్‌నగర్ డివిజన్‌లో ఈ ఇంకుడు గుంతల నిర్మాణాలను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికీ చాలా ఇంకుడు గుంతలు వ్యర్థాలతో పాటు తొలగించిన చెట్ల కొమ్మలు, నేల కూలిన చెట్ల వ్యర్థాలే దర్శనమిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.

సోమవారం నుంచి పనులు..

ఇంకుడు గుంతల్లో పూడికలు తొలగించే పనులను సోమవారం నుంచి చేపడుతున్నాం. ఈ విషయమై ఇప్పటికే సిబ్బందిని నియమించడం జరిగింది. సనత్‌నగర్ డివిజన్‌లో జల మండలి నిర్మించిన ఇంకుడు గుంతలను పూర్తి స్థాయిలో వర్షాకాలానికి సిద్ధం చేస్తున్నాం.

– వంశీకృష్ణ, డీజీఎం జల మండలి ఎస్సార్‌నగర్



అన్నదానం చేసిన స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ సంజీవ్ కుమార్, పావని, సభ్యులు

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

బన్సీలాల్‌పేట్, మే 26: పద్మారావునగర్‌కు చెందిన స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 253వ అన్నదానం నిర్వహించారు. రోడ్ల పక్కన ఉంటూ ఆకలితో అలమటించే వృద్ధులను, నిరాశ్రయులను, దివ్యాంగులను అప్యాయంగా పలకరించి వారికి భోజనం సమకూర్చామని స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని తెలిపారు. తీవ్రమైన ఎండలకు అల్లాడుతున్న అనాథలు, నిరాశ్రయులను చేరదీసి వారికి ఆశ్రయం, ఉపాధి అవకాశాలను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని వారన్నారు. స్కై ఫౌండేషన్ సభ్యులు కోమల్, అఖిల్, హరీశ్, నరేశ్ పాల్గొన్నారు.

నామాల గుండులో పేదలకు అన్నదానం

సికింద్రాబాద్, మే 26: నామాల గుండు చౌరస్తాలో స్థానిక యువకులు ఆదివారం పేదలకు అన్నదానం చేశారు. సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని టీఆర్టీ క్వార్టర్స్‌లో నివాసం ఉండే ప్రవీణ్ అనే యువకుడు అనివార్య కారణాల వల్ల ఈ మధ్య కాలంలో సూసైడ్ చేసుకున్నాడు. సూసైడ్ చేసుకుని 10 రోజులవుతున్న సందర్భంగా పేదలకు స్నేహితులంతా కలసి అతని గుర్తుగా అన్నదానం చేశారు. ముందుగా ప్రవీణ్ చిత్రపటం ఏర్పాటు చేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నామాల గుండు చౌరస్తాలో పేదలకు అన్నదానం చేస్తున్న యువకులు

శ్రీనివాస్‌కు పురస్కారం అందించి సన్మానం చేస్తున్న తల్లోజు ఆచారి తదితరులు

ఘనంగా విశ్వకర్మ లెజెండరీ అవార్డ్స్ ప్రదానోత్సవం

చిక్కడపల్లి, మే 26: విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ 8వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్ర బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సెంటర్ అధ్యక్షుడు విశ్వనాదుల పుష్పగిరి ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న విశ్వకర్మ ప్రముఖులకు విశ్వకర్మ లెజండరీ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీఠాదీశ్వర్లు జగద్గురు శ్రీ కాతేంద్రస్వామి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి హాజరై అవార్డును ప్రదానం చేశారు. సమాజ హితం కోసం సేవచేసే వారిని గుర్తించి అవార్డులతో సత్కరించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా దొంచనాల శ్రీనివాస్‌కు జీవన సౌఫల్య పురస్కారం అందజేశారు. ఈ సమావేశంలో చర్లపల్లి జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్ దర్లా కాలిదాసు, తెలంగాణ సాహితి అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, ఐఎన్‌పీఆర్ పబ్లిసిటీ సెల్ జాయింట్ డైరెక్టర్ వెంకటరమణ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ డాక్టర్ బి. నీలిమాకృష్ణమూర్తి, దిలీప్‌చారి, దరువు అంజన్న, తాటి కొండ రంగబాబు, జీతేంద్ర చారి, గణేశ్ బాబు, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

మహాత్మానగర్‌లో శ్రీ సత్యసాయి బాబా ట్రస్ట్ గాంధీనగర్ బ్రాంచి ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. పేదలకు ప్రతి నెలా 5 కేజీల బియ్యంతో పాటు అన్ని నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని ట్రస్ట్ ప్రతినిధులు రామన్, ఏఎస్ రాజు, మధుసూదన్, నర్సింహ, ఎంఎల్ఎన్ స్వామి, బిజ్జి కనకేశ్ కుమార్ తెలిపారు.

– కవాడిగూడ, మే 26

అలరించిన కాళీమాత నృత్యోత్సవం

నృత్యోత్సవంలో రిత్విక్ వెంకట్

రవీంద్రభారతి, మే 26 : తెలంగాణ ప్రభుత్వం, భాషాసాంస్కృతిక, నృత్య దర్పణ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ అర్ధనారీశ్వరం వెంకట్ రెండవ జయంతి సందర్భంగా వెంకట్ కుమారుడు రిత్విక్ వెంకట్ ప్రదర్శించిన కాళీమాత నృత్యోత్సవం ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీటీడీ మ్యూజిక్ డైరెక్టర్ డాక్టర్ ఏకేవీఎస్ రెడ్డి, ప్రముఖ నాట్యగురువు డాక్టర్ ఎస్‌పీ భారతి హాజరై జ్యోతి ప్రజ్వలనం చేసి వెంకట్ చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం రిత్విక్‌తో పాటు నృత్య దర్పణ డ్యాన్ అకాడమీ శిష్య బృందంతో ప్రదర్శించిన కాళీమాతోత్సవ నృత్య ప్రదర్శన వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది. కార్యక్రమంలో అర్ధనారీశ్వరం వెంకట్ కుమార్తె చార్మిల వెంకట్ పాల్గొన్నారు.

ప్రిలిమ్స్ మాక్ టెస్ట్‌కు స్పందన



పరీక్షలకు హాజరైన సివిల్స్ అభ్యర్థులు

చిక్కడపల్లి, మే 26 : విజన్ ఐఏఎస్ ఆధ్వర్యంలో సివిల్స్ అభ్యర్థుల కోసం నిర్వహించిన ప్రిలిమ్స్ మాక్‌టెస్ట్‌కు స్పందన వచ్చిందని ఆ సంస్థ హైదరాబాద్ బ్రాంచ్ హెడ్ హరే కృష్ణసింగ్ అన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఆదివారం నిర్వహించిన ప్రిలిమ్స్ మాక్‌టెస్ట్‌కు వెయ్యి మందికంటే ఎక్కువ వచ్చారని తెలిపారు. అభ్యర్థులకు ఈ టెస్ట్ ఎంతో దోహదపడుతుందని ఆయన అన్నారు.

మధుమేహంపై అవగాహన కలిగి ఉండాలి

డయాబెటీస్ ఎక్స్‌పో -2024 ప్రారంభోత్సవంలో మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ

డయాబెటీస్ ఎక్స్‌పో -2024ను ప్రారంభిస్తున్న మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ, తదితరులు

కొండాపూర్, మే 26: మధుమేహంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి దరిచేరకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు వచ్చాక పాటించాల్సిన నియమాలపై ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ అన్నారు. ఆదివారం డాక్టర్ మోహన్స్ డయాబెటీస్ స్పెషాలిటీస్ సెంటర్ ఆధ్వర్యంలో ఫిల్మ్‌నగర్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన డయాబెటీస్ ఎక్స్‌పో-2024కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధుమేహం వ్యాధి చాప కింద నీరులా విస్తరిస్తుందని, దేశంతో పాటు హైదరాబాద్ నగరంలో వ్యాధి తీవ్రత పెరుగుతుందన్నారు. యువత, చిన్న పిల్లలు సైతం మధుమేహం వ్యాధికి గురవుతున్నారని, మారుతున్న జీవన విధానాలు, ఆహారపు అలవాట్లు ప్రధాన కారణంగా మారుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ చైర్మన్ డాక్టర్ కే సతీశ్‌రెడ్డి, ప్రొఫెసర్ బీకే సహాయ్, డాక్టర్ వీ మోహన్, డాక్టర్ ఆర్ఎం అంజన తదితరులు పాల్గొన్నారు.

మేడిబావిలో వ్యర్థాల తొలగింపు

మేడిబావిలో రోడ్లపై ఉన్న వ్యర్థాల తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

సికింద్రాబాద్, మే 26: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో మురుగు నీరు రోడ్లపై పారుతుంది. స్థానికుల ఫిర్యాదు మేరకు స్పందించిన స్థానిక కార్పొరేటర్ హేమ, జలమండలి అధికారులు డ్రైనేజీలను లోతుగా పూడిక తీయించారు. రోడ్లపై పారుతున్న మురుగు నీటి సమస్యకు పరిష్కారం చూపారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు నాలాలు పొంగి పొర్లుతున్నాయి. డ్రైనేజీలు చెత్తా చెదారంతో నిండిపోయి మురుగు నీరు రోడ్లపై పారుతుంది. సంబంధిత అధికారులు పారిశుధ్య సిబ్బందితో లోతుగా పూడిక తీపించారు. వ్యర్థాలను మాత్రం రోడ్ల పైనే వదిలారు. నాలాలలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగిస్తున్నారు. నాలాలు, డ్రైనేజీలు వ్యర్థాలు నిండిపోయి మురుగు నీరు రోడ్లపై పారుతుందని, దీంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతుందని అధికారులకు ప్రజల నుంచి ఫిర్యాదులు అందటంతో అధికారులు స్పందించి నాలాలు, డ్రైనేజీల నుంచి తీసిన వ్యర్థాలను ఆదివారం సిబ్బంది తొలగించారు.

విద్యుత్ తీగలకు అడ్డు తొలగింపు

సీతాఫల్‌మండి రామాలయం వద్ద ప్రధాన రోడ్డులో చెట్టు కొమ్మలు తొలగిస్తున్న సిబ్బంది

సికింద్రాబాద్, మే 26: సీతాఫల్‌మండి రామాలయం వద్ద ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్టు కొమ్మలను అధికారులు తొలగించారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న చెట్టు కొమ్మలు, వర్షం వచ్చినప్పుడు గాలులకు పడి పోయిన చెట్లను తొలగించాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతుండటంతో అధికారులు స్పందించారు. చెట్టు కొమ్మలు రోడ్డుకు ఇరు వైపులా బాగా పెరగడంతో విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో అధికారులు శని, ఆదివారాలు విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న, ఎక్కువగా పెరిగి ఇబ్బందులు కలిగిస్తున్న చెట్టు కొమ్మలను తొలగించారు. వేసవి కాలంలో విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా ముందు జాగ్రత్తగా చర్యలు చేపట్టారు.

వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం

వేసవి శిక్షణ శిబిరాలను ప్రారంభించిన జంపన ప్రతాప్, చిత్రంలో తదితరులు

కంటోన్మెంట్, మే 26: కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ తరుపున పేద విద్యార్థులకు, క్రీడాకారులకు వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్ తెలిపారు. కంటోన్మెంట్ బోయిన్‌పల్లి క్రీడామైదానంలో వేసవి శిక్షణ శిబిరాలను ఆదివారం ప్రారంభించారు. ఈ శిబిరాలు జూన్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా యాదవ్, కరణ్ సింగ్, యాదగిరి, ప్రభు కుమార్ పాల్గొన్నారు.

రైతాంగ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి

నారాయణరెడ్డి చిత్ర పటానికి నివాళులర్పించిన కళా జనార్దన మూర్తి, తదితరులు

ముషీరాబాద్, మే 26: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా ఆదివారం ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మవిభూషణ్ రావి నారాయణరెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి పాల్గొని రావి నారాయణరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్రపోషించిన రావి నారాయణరెడ్డి ఎందరికో ఆదర్శంగా నిలిచిన గొప్ప సాయుధ పోరాట యోధుడని కొనియాడారు. నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య వ్యవస్థను అంతమొందించడానికి అలుపెరుగని పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయనీ ఆమని, నైషధం సత్యనారాయణ మూర్తి, తోట శ్రీలక్ష్మి, తాళ్లపల్లి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

చిక్కడపల్లి, మే 26: సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సహకారం తో పైడి రాకేశ్‌రెడ్డి ఫౌండేషన్, 9 స్టార్ హెల్త్‌కేర్, జీజీ చారిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరాన్ని పైడి రాకేశ్‌రెడ్డి ఫౌండేసన్ చైర్మన్ సుచరితారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. క్లబ్ అధ్యక్షుడు ఆర్.వివేక్, ప్రధాన కార్యదర్శి పి.వెంకట స్వామి గౌడ్, రమేశ్ గుప్తా, నవీన్, శివ, శంకర్ ముదిరాజ్ పాల్గొన్నారు.